పేదల ఆరోగ్యం కోసమే ఫ్యామిలీ డాక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : గ్రామ స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్(కుటుంబ డాక్టర్) విధానాన్ని ప్రారంభించిందని, ఈ విధానం ద్వారా ఇంటి వద్దే వైద్య సేవలు అందుకోవచ్చని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు కురసాల కన్నబాబుతో కలిసి కాకినాడ గ్రామీణ మండలం, వాకలపూడి సచివాలయం-3 పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు(పీహెచ్సీ) విలేజ్ క్లినిక్‌లను అనుసంధానం చేసి గ్రామస్థాయిలో ప్రతి కుటుంబం ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం నూతన 104 వాహనాన్ని కలెక్టరు, ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్. రమేష్, డీఎల్డీవో పీ.నారాయణమూర్తి, వైద్య సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : ప్రజలకు ఆధునిక వైద్యాన్ని ఉచితంగా అందించేలా ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి పేదల ఆరోగ్య భద్రతకు పెద్ద పీట వేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానం అనే మహెూన్నత కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం, లింగంగుంట్ల గ్రామం నుండి పూర్తి స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు అయ్యేలా లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా స్థాయి కార్యక్రమం కొవ్వూరు మండలం కాపవరం నుంచి ప్రారంభించగా రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టరు డాక్టర్ కే. మాధవీలత ఎ. ఎం. సి. చైర్మన్, ఏఎంసీ చైర్మన్ వల్లభ శెట్టి శ్రీనివాస్, జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్, పోసిన శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ మెడికల్ క్లినికల్ వాహనాల ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : పేదరికం అనేది పెద్ద రోగమని, దీనికి తోడు జబ్బున బారిన పడితే ఆ కుటుంబం పరిస్థితి వర్ణనాతీతమని, దీనిని గ్రహించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకు వచ్చారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచారపౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కే గంగవరం సత్యవీడు గ్రామంలో వైద్య సేవలో భాగంగా మొబైల్ మెడికల్ క్లినికల్ వాహనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టి ఎన్నో కుటుంబాలకు వైద్య సేవలు అందించి వారి హృదయాల్లో నిలిచారన్నారు. ఈ సందర్భంగా మంత్రి మొబైల్ మెడికల్ వాహనాలను సందర్శించి వాటిలో వున్న సౌకర్యాలు పరిశీలించారు. జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కే గంగవరం మండలం ఎంపీపీ పంపన నాగమణి, పీహెచ్ డాక్టర్ టి. మాణిక్యాలరావు, గ్రామ సర్పంచ్ సలాది వెంకన్న, స్థానిక ప్రజాప్రతి నిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకే 70 శాతం పథకాలు

విశాలాంధ్ర - కాకినాడ : మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానంలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్ష అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అందువల్లే మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేయడంతో పాటు 70 శాతం పథకాలను మహిళల పేరుతోనే ఇస్తున్నారన్నారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలో గురువారం జరిగిన వైయస్సార్ ఆసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కమిషనర్ కే రమేష్, అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, వైయస్సార్సీపీ నగర అధ్యక్షురాలు మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల గౌరవాన్ని పదింతలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. వైయస్సార్‌సిపి కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు-నేను విన్నాను-నేను ఉన్నాను అంటూ అభయమిచ్చిన సీఎం జగన్..అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు భరోసాగా నిలిచారన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్ మాట్లాడుతూ వైయస్సార్ ఆసరా ద్వారా మూడో విడత కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో సుమారు 26 కోట్ల రూపాయలు మేరకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ కాకినాడ సిటీ నియోజకవర్గ పరిశీలకులు పీకే రావు, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, కాకినాడ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం : సీతానగరం మండలంలో గురువారం సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు చేతుల మీదుగా ప్రెస్ క్లబ్ ప్రారంభమైంది. దీనిలో భాగంగా పలివెల వీరబాబు ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ సమాజ హితం కోసం పని చేసే విలేకరులకు ఇన్ని సంవత్సరాల నుండి కార్యాలయం లేక పోవడంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారని దానిని చూసి చలించి నా వంతు సహాయంగా ఈ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేశానని అన్నారు. విలేకరులు ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసినందుకు వీరబాబుకి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐ శుభ శేఖర్ కూడా ప్రెస్‌క్లబ్‌కి వచ్చి తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్, శ్రీనివాస్, పోసియ్య, సూరిబాబు, దుర్గా రావు, సతీష్, కరిముల్ల, సురేష్, రాజు, నాగ రాజు, చిట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పన ధ్యేయంగా ఉపాధి హామీ పథకం

విశాలాంధ్ర - సీతానగరం : ఉపాధి కల్పన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేసిందని ఏపిడి శ్రీనివాస్ తెలిపారు. మండలంలో గురువారం ఏపిడి శ్రీనివాస్ నాగంపల్లి, చీపురుపల్లి పంచాయితీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపిడి శ్రీనివాస్ విశాలాంధ్ర విలేకరితో మాట్లాడుతూ సీతానగరం మండలంలో తనిఖీలో అమ్రిత సారోవర్ పథకంలో భాగంగా రాముడు, కొరవరి చెరువులో పని చేస్తున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించినట్టు తెలిపారు. ఈ సవంత్సరం ఉపాధి వేతనం 252 నుండి 272 రూపాయలకు పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ నాగ శేష వేణి, టిఏ అంజి, చందు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దళితులపై వైసీపీ అకృత్యాలకు నిరసనగా

11న చలో విజయవాడ

విశాలాంధ్ర - కాకినాడ : వైసీపీ ప్రభుత్వంలో దళితులు, మైనార్టీలపై హత్యకాండ కొనసాగుతోందని ఈ అకృత్యాలను నిరసిస్తూ ఈనెల 11న పూలే జయంతి రోజున చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిలపక్ష రాజకీయ దళిత ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సాంబమూర్తి నగర్ పిఆర్ భవన్లో దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా కాకినాడ జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. దీనికి టిడిపి, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, జనసేన, బీఎస్పీ, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, ఆర్పిఐ లిబరేషన్, జనశక్తి ఎంఎస్పి తదితర పార్టీలు వివిధ ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు. ముందుగా ప్రముఖ న్యాయవాది పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. ఈ నెల 11న జరిగే చలో విజయవాడకు దళితులు మైనార్టీలు, ఆదివాసీలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. టిడిపి నగర అధ్యక్షులు ఎన్. వీరు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కే. అప్పారావు, తుమ్మల రమేష్, బాలాజీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గద్దె దించడానికి దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు కలిసి రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని అన్ని వర్గాలకు టిడిపి నేతలు పిలుపునిచ్చారు. దళిత ఉద్యమ నేత ఎ. కామేశ్వరరావు మాట్లాడుతూ దళితులకు రాజ్యాంగంలో అనేక హక్కులు చట్టాలున్నా వాటిని ఏ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పిసిసి మెంబర్ ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక దళితులు, మైనార్టీలు, వెనుకబడిన వర్గాలకు రక్షణ కరువైందన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని అన్నారు. ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట వరప్రసాద్ మాట్లాడుతూ దళిత యువకుడు హత్య కేసులో ముద్దాయిగా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబును ప్రభుత్వం రాచ మర్యాదలతో చూసుకుందని పలుమార్లు బెయిల్ ఇవ్వడానికి ప్రయత్నాలు చేసిందని దానిని ముప్పాళ్ళ సుబ్బారావు తిప్పి కొట్టారని ఆయన పేర్కొన్నారు. ఎంఎస్‌పి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరు సత్తిబాబు మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు, గిరిజనుల ఓట్లతో అధికారులకు వచ్చిన వైసీపీ ప్రభుత్వం వారిపై దాడి చేయడం దారుణం అన్నారు. ఏఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. సతీష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నాళ్లు గడుస్తున్న దళితులపై దాడులు ఆగడం లేదన్నారు. కాకినాడ జిల్లా సిపిఐ కార్యదర్శి కే. బోడకొండ మాట్లాడుతూ ఈనెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంకు దళితులందరూ చేరుకోవాలని పదో తేదీ నుండి విజయవాడకు తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎంఎల్, సిపిఐ, ఎంఎల్, లేబరేషన్ కార్యదర్శి ఎ. అర్జున్ రావు, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వి చిట్టిబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా దళిత చైతన్య జిల్లా అని అటువంటి జిల్లాలో రోజురోజుకు దళితులపై హత్యలు, దాడులు జరుగుతున్నాయన్నారు. దీనిపై అందరూ కలిసి ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, టిఎన్‌టియుసి సబిత ఫణీశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ కే సింహాచలం, అఖిల భారత రైతుకుల సంఘం జిల్లా అధ్యక్షులు జే సత్తిబాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మరుకుర్తి ఏసుబాబు, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు పిఎస్ నారాయణ, కే ఆదినారాయణ మూర్తి, పెద్దిరెడ్డి సత్యనారాయణ, ఐఎన్‌టియుసి తాళ్లూరు రాజు, మాల మహా నాడు జాతీయ అధ్యక్షులు దానం లాజర్ బాబు, జనసేన నాయకులు నక్క శ్రీనివాసరావు, తోట వేణు, రాజన్న పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు తోట వేణు, మహేష్ బాబు, రాయుడు, మోజేష్ బాబు, 93 కులాల సంఘాల ఐక్యవేదిక మాకిరెడ్డి భాస్కర్ బాబు, ఏఐవైఎఫ్ నాయకులు ఎమ్మెస్ రాజు, ఆర్టీసీ నాయకులు ఎంఎస్ఎంఎస్ తదితరులు ప్రసంగించారు.

ఇళ్ళ వద్దనే మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఇళ్ళ వద్దనే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని రూపొందించారని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం గ్రామ సచివాలయం-4 పరిధిలో గురువారం ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చి దేశం దృష్టిని ఆకర్షించారన్నారు. వైద్యరంగంలో చేపట్టిన ఎన్నో విప్లవాత్మక చర్యల్లో భాగంగా ప్రతీ గ్రామంలో వెల్నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి అక్కడ ఒక నర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, ఊబలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు హసీనా, శ్రీకాంత్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గురువులు మార్గనిర్దేశం చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం గురువులు మార్గనిర్దేశం చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ఆచార్య కె.రామమోహన రావు అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్,సెక్రటరీస్ అండ్ కరస్పాండెంట్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ సర్వీస్ ప్రోజెక్టు, ఇంటర్న్ షిప్పు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. రెండు లక్షల విద్యార్థులు ఇంటర్న్ షిప్ లను చేసారన్నారు. మరో అతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ అనుబంధ కళాశాలల ఎఫిలియేషన్, ఆన్లైన్ పరీక్షల విధానం వంటి అంశాలను వివరించారు. కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న ఆన్లైన్ విధానాన్ని జెఎన్టియుకె లో సమర్థవంతంగా నిర్వహించామని చెప్పారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి, ఉన్నత విద్యాశాఖ నాణ్యమైన ఉన్నత విద్యకు కృషి చేస్తున్నారన్నారు.అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సభాధ్యక్షులు కె.శ్రీరమేష్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డీన్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, వివిధ అంశాలపై ప్రసంగిం చారు. దీనిలో భాగంగా అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈసీ సభ్యులు డాక్టర్ బి.జగన్మోహన రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ నిర్మాణాలను చేపట్టాలి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలి గ్రామంలోని హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆత్రేయపురం మండల ప్రత్యేక అధికారి ఎంవీ రామారావు, ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ డీవీఎన్ అనిల్ కుమార్ తెలిపారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో హౌసింగ్ లబ్దిదారులతో సమావేశం నిర్వహించిన అధికారులు మాట్లాడుతూ హౌసింగ్ మంజూరైన ప్రతీ ఒక్కరు గృహనిర్మాణాలు ప్రారంభించుకొని సొంతింటి కలను నిజం చేసుకోవాలని కోరారు. వచ్చిన అవకాశం వినియోగించుకొని స్థిరాస్తిని అభివృద్ధి చేసుకోవాలని, ప్రభుత్వ పరంగా వారికి రావాల్సిన అన్ని బిల్లులు సకాలంలో అప్లోడు అయ్యేలా లబ్దిదారులకు అండగా ఉంటామని అన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా ఋణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. లేఅవుట్‌లో నిర్మాణాలను పరిశీలించారు. ఈ సమావేశంలో ఏపీఎం అప్పలకొండ, ఏపీఓ విజయ భారతి, సెక్రటరీ కృష్ణమాచార్యులు, వీఆర్వో శేషగిరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తేజ, జగదీష్, శేషారత్నం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్దిదారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో పది లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు చంద్రబాబు నాయుడు కాలనీలో ఇప్పటివరకు సిసి రోడ్డు లేకపోవడంతో సచివాలయ ప్రాంత అభివృద్ధి నిధులతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు తెలిపారు దశల వారీగా చంద్రబాబునాయుడు కాలనీ ఇందిరమ్మ కాలనీలలో సిసి రోడ్లు నిర్మాణం చేపడతామని దుర్గారావు అన్నారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ వైసీపీ నేతలు పచ్చ రాంగోపాల్, దుగ్గిన గంగాధరరావు కామిశెట్టి దుర్గారావు సిద్ధ సూర్యారావు తదితరులున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

విశాలాంధ్ర - రావులపాలెం : రాబోయే ఎన్నికలు పేద ప్రజలకు, పెత్తందార్లకు మధ్య జరిగే ఎన్నికలుగా భావించాలని, వైసీపీకి ఓటు వేస్తే పేద ప్రజలు బాగు పడతారని, టీడీపీకి ఓటు వేస్తే పెత్తందారీ వ్యవస్థ బాగు పడుతుందని ఎవరికి ఓటు వేయాలో ప్రజలే నిర్ణయించుకోవాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థ రెడ్డి అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన రావులపాలెంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక శ్రీ సత్యసాయి కళాశాలల వద్ద రూ.12.5 లక్షలతో నిర్మించిన పంచాయతీరాజ్ సీసీ రోడ్డు, మండలంలోని లక్ష్మీపోలవరం గ్రామంలో రూ.17.5 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్ భవనాలను వారు ప్రారంభించారు. రావులపాలెం వైసీపీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల ప్రచార పోస్టర్లు, వీడియోని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచులు తాడేపల్లి నాగమణి, హనుమంతవఝుల హేమలత, ఉప సర్పంచులు హనుమంతవఝుల రామశాస్త్రి, గొలుగూరి మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదంతస్తుల భవనం పైనుండి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడలో ఎస్ అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలో ఉన్న శివం విహార అపార్టుమెంట్లో గురువారం భవన నిర్మాణ కార్మికుడు సెంట్రింగ్ మేస్త్రి ఐదంతస్తుల పై నుండి కింద పడి మృతి చెందాడు. సంఘటన తెలుసుకున్న ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ కుటుంబ సభ్యులు, యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేశారు. పోలీసు వారి సమక్షంలో యాజమాన్యంతో సంప్రదింపులు చేయగా భవన నిర్మాణ కార్మికుడు వాసంశెట్టి ప్రసాద్ కుటుంబానికి ఆర్థిక నష్ట పరిహారం చెల్లించాలని, యాజమాన్యాన్ని తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. యాజమాన్యం అపార్ట్మెంట్‌కి ఇన్సూరెన్స్ సౌకర్యం చేయించామని, కార్మికులకు ఏ ప్రమాదం జరిగినా ఇన్సూరెన్స్ క్లెయిమ్ వర్తిస్తుందని బదులు చెప్పారని ప్రసాద్ అన్నారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ విషయంపై అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌ని సంప్రదించగా వయసు నిర్ధారణ బట్టి పది నుంచి పదిహేను లక్షల వరకు నష్టపరిహారం వస్తుందని తెలిపారని ప్రసాద్ అన్నారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ మంజూరు కాని పక్షంలో బిల్డర్ యాజమాన్యం బాధ్యత వహిస్తామని లిఖితపూర్వకంగా భరోసా ఇచ్చారని ప్రసాద్ అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి వారు అపార్ట్మెంట్, ఇతర నిర్మాణాల్లో భవన నిర్మాణ కార్మికుల భద్రతపై తనిఖీలు నిర్వహించి అన్ని అపార్ట్మెంట్లో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేలా చొరవ చూపాలని, అపార్ట్మెంట్ నిర్మాణాల్లో ప్లాన్ సక్రమంగా లేకుండా అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తనిఖీలు నిర్వహించి భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలను కాపాడాలని ప్రసాద్ డిమాండ్ చేశారు.

గోల్డెన్ జూబ్లీకి ఐడియల్ కాలేజీ సిద్ధం

విశాలాంధ్ర - కాకినాడ : ఈనెల 8వ తేదీన జరగబోయే ఐడియల్ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సిద్ధమవు తోంది. 50 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పండుగ చేసుకునేందుకు పూర్వ విద్యార్థుల ఏకమవుతున్నారు.

కాకినాడ ఐడియల్ కళాశాలను ప్రముఖ విద్యావేత్తలు, మేధావులు సామాజిక బాధ్యతగా ఉన్నత విద్యను పేద పిల్లలకి అందించాలని సదుద్దేశంతో డాక్టర్ పివిఎస్ రాజు, డాక్టర్ ఎస్ఎస్ఆర్ శాస్త్రి, డాక్టర్ పి.చిరంజీవి కుమారిలు ఈ సంస్థను నెలకొల్పారు. భారత పార్లమెంట్ లోక్ సభ స్పీకర్‌గా గంటి మోహన చంద్ర బాలయోగి, పద్మశ్రీ అవార్డు గ్రహీత సిరివెన్నెల సీతారామశాస్త్రి, వంటి ప్రముఖులందరూ ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన వారే. ఈ నెల 8వ తేదీ శనివారం నాడు ఉదయం 10 గంటల నుండి రాత్రి వరకు కాకినాడ సోమర్లకోటలో రోడ్డులో గల ఐడియల్ కాలేజీలో వేదికని సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు జస్టిస్ మాంధాత సీతారామమూర్తి, జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి, ఐఏఎస్ అధికారి కన్నబాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఎందరో ఐపిఎస్ అధికారులు, సివిల్ అధికారులు పాల్గొననున్నారు. పూర్వ విద్యార్థులు అందరూ హాజరుకావాలని డాక్టర్ పి. చిరంజీవి కుమారి కోరుతున్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

గంజాయి అమ్మే వారి సమాచారం ఇస్తే రూ. 50 వేల నజరానా

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమ జిల్లాలో గంజాయి విక్రయాల సమాచారం అందిస్తే యాభై వేల నజరానా ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్లా తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణా, అమ్మే వారి(పెడ్లర్స్)సమాచారం పోలీసులకు అందిస్తే 50 వేల రూపాయలు గంజాయి వినియోగించే వారి సమాచారం అందిస్తే 10 వేల రూపాయలు బహుమతిగా ఇస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం గంజాయి, ఇతర డ్రగ్స్ నియంత్రణలో మెరుగైన సమన్వయం కోసం జిల్లా స్థాయి కమిటీ (ఎన్‌సిఓఆర్‌డి) సమావేశం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ సిహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ లతా మాధురి ట్రైనీ ఐపీఎస్ పంకజ్ మీనా, డిఆర్ఓ సత్తిబాబు, ఆర్డిఓ అమలాపురం వసంత రాయుడు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. గంజాయి రవాణా, సరఫరా చేసేవారి, వినియోగదారుల సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని, ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712692102 ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి కానీ వాట్సాప్ ద్వారా గాని సమాచారం అందించొచ్చని తెలిపారు.

14 నుంచి ఆటల పోటీలు

విశాలాంధ్ర - సామర్లకోట : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి మహెూత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బ్రౌన్‌పేట డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ డాక్టర్ అంబేద్కర్ జయంతి రోజున వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రెండో రోజు మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16వ తేదీ ఉదయం 11 గంటల నుంచి బ్రౌన్‌పేట డాక్టర్ అంబేద్కర్ పార్క్ లో భారీ అన్నదాన కార్యక్రమాన్ని సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జయంతి కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 94410 11651 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు ఆర్టీసీ డిపో బస్సులకు కొవ్వూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 50 ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఆర్టీసీ డిపో మేనేజర్కు అందజేశారు. సుమారు 20వేల రూపాయల విలువైన ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసి ప్రమాద సమయంలో ప్రయాణికులకు ప్రాథమిక చికిత్స అందించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కంటమణి రామకిషోర్ కోరారు. లయన్ అహ్మద్ హుస్సేన్ ఆర్థిక సహకారంతో 50 ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించిన కొవ్వూరు లయన్స్ క్లబ్ సభ్యులకు డిపో మేనేజర్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కంటమణి రామకిషోర్, ఉపాధ్యక్షులు కలగర వెంకట్రావు, అహ్మద్ హుస్సేన్, సీనియర్ లయన్స్ సభ్యులు గోలి వెంకటరత్నం, మన్యం బుల్లిబాబు, యనమదుల వెంకట సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీకి మాత్రమే ప్రజల్లోకి వెళ్ళే ధైర్యం

విశాలాంధ్ర - అనపర్తి : ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసే పథకాలను చెప్పగలిగే ధైర్యం వైసీపీకి మాత్రమే ఉందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ "జగనన్నే మా భవిష్యత్తు" మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం రంగంపేట మండలం సింగంపల్లి నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, జెసిఎస్ మండల ఇన్‌చార్జిలు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

జగన్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

విశాలాంధ - కరప : ఒక్కచాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని మాయమాటలతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చేశారని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి విమర్శించారు. కరప మండల పరిధిలో కూరాడ గ్రామంలో గురువారం 115వ రోజు ఇంటింటికీ మీ అనంతలక్ష్మితో పాటు ఇదేం కర్మ మన రాష్ట్రానికి నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అరాచక పాలన అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం, తిరుగుబాటు రావాలన్నారు. నాలుగేళ్ల నుంచి అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బుంగసింహాద్రి, గుబ్బల శ్రీను, తలాటం సతీష్, చీపురుపల్లి జయేంద్ర బాబు, కాకర్ల బుజ్జి చౌదరి, పలివెల జానకి రామయ్య, గంజా రాంబాబు, మేడిశెట్టి పట్టాభి, ఓలేటి సూర్యనారాయణ ఉషారాణి, బొజ్జ భవాని, సాంబశివరావు, పంపన కన్నారావు, కోట శ్రీను, యలమంచిలి సుకుమార్, మట్టపర్తి కొండ, పిల్లి విజయ్ గోపాల్, పేపకాయల స్వామి, గంధం లక్ష్మీనారాయణ, పెంకే సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో వాడపల్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణోత్స వాలలో భాగంగా గత వారం రోజుల నుండి భక్తులకు నిర్విరామంగా సేవలు అందించిన సేవలను ఆత్రేయపురం ఎంపీడీఓ నాతి బుజ్జి అభినందించారు. గ్రామ సర్పంచి పోచిరాజు సూర్య కుమారి, గ్రామ ఉప సర్పంచి పోచిరాజు బాబూరావు, ఈఓఆర్డీ చంద్రశేఖర్, సెక్రటరీ విజయ్, రాజ కుమార్, వెంకట రెడ్డిల ఆధ్వర్యంలో రామచంద్రాపురం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుండి వచ్చిన 58 మంది పారిశుధ్య కార్మికులను, పర్యవేక్షణలో పాల్గొన్న గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులను, ఆత్రేయపురం ర్యాలి ఊబలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సునీత, డాక్టర్ సౌమ్య, డాక్టర్ దివ్య పావని ఆధ్వర్యంలో నిర్విరామంగా రోజుకు మూడు షిఫ్ట్‌లలో రెండు బృందాలుగా పనిచేశారన్నారు. 1182 మంది భక్తులకు అవసరమైన అత్యవసర సేవలు అందించిన 42 మంది వైద్య సిబ్బందిని వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవాలు ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా ఆలయ చైర్మన్, కమిటీ వారు నిర్వహించారని, లక్షలాది మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-గణపవరం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పేద, మధ్య తరగతి ప్రజల కోసం మన ఊరిలోనే మన ఇంటి వద్దనే ఉచిత వైద్యం ఏర్పాటు చేసినట్టు ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. గురువారం గణపవరం ఇందిరమ్మ కాలనీ వద్ద సచివాలయం-2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బి హెచ్ ఆర్ సంతోష్ నాయుడు, డాక్టర్ పి కిరణ్మయి,డాక్టర్ కె ప్రియాంక సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, ఎంపీపీ దండు వెంకటరామ రాజు, కాకర్ల విష్ణు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రులో: మన ఊరిలోనే మన ఇంటి వద్దే ఉచిత వైద్య ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసు బాబు) అన్నారు. గురువారం మండలం బువ్వనపల్లి సచివాలయం-2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మాదిరిగా వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మన ఊరిలోనే మన ఇంటి వద్దే ఉచిత వైద్యం దేశంలో ఎక్కడా లేనటువంటి విధంగా వ్యాధి నివారణ సేవల్లో రాష్ట్రం ముందున్నది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిలారి సత్యవతి, రవిబాబు, వెజ్జు వెంకటేశ్వరరావు, సంకు సత్య కుమార్, వెల్లంకి నరేష్, డాక్టర్ కె.భాగ్యశ్రీ ,డాక్టర్ పి. తేజశ్రీ ,డి. సంజీవ, ఎం. జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు వైద్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని తాడినాడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మధ్య తరగతి వర్గాల వారికి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి వైద్య సేవలను అందించారన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు వైద్య విప్లవానికి నాంది పలికాయని అన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పేదల సంక్షేమం కోసం అనితర సాధ్య రీతిలో సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఇంటింటికి వైద్యులను పంపి మీ ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం నాంది పలికిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కనకదుర్గా రాణి, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, సర్పంచి తాడి శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సాగి చిన్నబ్బాయి రాజు, అల్లూరి సత్యనారాయణ రాజు, జంపన చిన్న రాము, నంబూరి శ్రీదేవి, పామర్తి సత్యనారాయణ, కలిదిండి పిహెచ్సి వైద్యులు ప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేరువలో ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు తెలిపారు. మండలంలోని కొణితివాడ ఆరోగ్యకేంద్రం పరిధిలోని మడుగు పోలవరం, కొణితివాడ గవరపాలెంలలో ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. మడుగు పోలవరంలో ఏఎంసి చైర్మెన్ కోటిపల్లి బాబు, కొణితివాడలో సర్పంచ్ బీసెట్టి లక్ష్మిలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మానుకొండ ప్రదీప్ కుమార్, నాగరాజు శ్రీనివాసరాజు, మండల కన్వీనర్ ఓంకారం, సత్యనారాయణ, డా.టి.లక్ష్మీ అలేఖ్య, హెల్త్ అసిస్టెంట్ సిహెచ్ సత్యవతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవాని రంగా, సర్పంచ్ పాము సునీత మాన్సింగ్ కోరారు. గురువారం భీమడోలు మండల స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని స్థానిక మూడవ నెంబర్ గ్రామసచివాలయం వద్ద ప్రారంభించారు. రోగులకు వైద్య సేవలను గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రసాద్ అందజేశారు. ఆరోగ్య సిబ్బంది రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్, జెడ్పిటిసి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులకు వారి నివాస ప్రాంతాల వద్ద వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్యశ్రీనివాస్, వైసీపీ నాయకులు పాము మాన్సింగ్, తుమ్మకుంట రంగా, రామకుర్తి నాగేశ్వరరావు, భీమడోలు ఎంపీటీసీ ముళ్ళగిరి జాన్సన్, వైద్య అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు

విశాలాంధ్ర -కైకలూరు : పార్టీ ఆదేశానుసారం గురువారం నుంచి ఈ నెల 20 వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం దిగ్విజయం చేయడంలో మండల జేసిఎస్ కన్వీనర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు అత్యంత పగడ్బందీ గా ప్రజారంజకంగా నిర్వహించి పార్టీ పటిష్టతకు పాటు పడాలని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు నియోజకవర్గ వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కైకలూరు రైల్వేస్టేషన్ వద్ద గల నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, మండల జేసిఎస్ కన్వీనర్లతో సమావేశం అయ్యారు.తొలుత కార్యక్రమం విధివిధానాలు చేపట్టవలసిన చర్యలు ఆచరణాత్మక ప్రణాళిక లను దృశ్య శ్రవణ విధానం ద్వారా వివరించిన అనంతరం కార్యక్రమం చేపట్టి పూర్తిచేయవలసిన విధానాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు వివరించి కార్యక్రమ కిట్స్, కార్యక్రమ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు మండల జేసిఎస్ కన్వీనర్ అడవి వెంకట కృష్ణ మోహన్, ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, మండవల్లి మండల జేసిఎస్ కన్వీనర్ పెద్దిరెడ్డి శ్రీ రామ దుర్గాప్రసాద్, కలిదిండి ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారతదేశానికి మంచి పేరు

విశాలాంధ్ర - గణపవరం: ప్రపంచ దేశాల్లో భారతదేశానికి అత్యున్నత గౌరవం లభించినందుకు ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న కృషి ఎనలేనిదని జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు నంద్యాల రామలింగరాజు అన్నారు. గురువారం గణపవరం మండలంలో బిజెపి 43వ ఆవిర్భావ దినోత్సవం బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కోయ్యల వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో పిప్పర, అగ్రహారం గోపవరం, గణపవరం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగరాజు, సుబ్బారావులు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో పోలింగ్ బూత్, శక్తి కేంద్రాలు కన్వీనర్లు నియమకం చేసి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలివెల వెంకట శ్రీనివాస్, నందూరి శ్రీనివాస్, అద్దగర్ల పుల్లారావు, ఎస్సీ మోర్చా మొరార్జీ ,బి రామారావు, గోపవరం జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద సురక్షిత త్రాగునీరు తప్పనిసరిగా ఉంచాలి

విశాలాంధ్ర-ఏలూరు: వేసవి దృష్ట్యా జిల్లాలో నిర్వహిస్తున్న పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద సురక్షిత మంచినీరును ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కస్తూరిబా నగరపాలక బాలిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదోతరగతి పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సెంటర్లను పటిష్టమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర-భీమడోలు: బీజేపీ 43వ ఆవిర్భావ వేడుకలను భీమడోలులో పార్టీశ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం భీమడోలు సంతమార్కెట్ వద్ద నున్న బీజేపీ స్తూపం వద్ద పార్టీ మండల అధ్యక్షులు ప్రవీణ్ పటేల్ స్థానిక నేతలతో కలిసి పార్టీజెండాను ఎగురవేసారు. స్వీట్లు,బిస్కెట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా ప్రవీణ్ పటేల్ మాట్లాడుతూ బీజేపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ఆరు రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా దళితమోర్చా అధ్యక్షులు మత్తి శ్రీనివాసశాస్త్రి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కృష్ణకుమారి పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్ విడుదల

విశాలాంధ్ర కుక్కునూరు: మా నమ్మకం (భవిష్యత్తు) నువ్వే జగన్ అనే పోస్టర్ ను గురువారం కుక్కునూరులో గ్రామ సచివాలయ మండల కన్వినర్ (జేసియస్) ఇన్చార్జి ఆవుల బాలకృష్ణ రెడ్డి, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు కుచర్లపాటి నర్సింహారాజు రాజు విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం కన్వీనర్ ,గృహ సారధులు ప్రతి ఇంటికి ప్రజా మద్దతు పుస్తకం తీసుకువెళ్ళి, ముందుగా జగన్ అన్న గృహసారధులు పరిచయం చేసుకోవాలని, వారితో మమేకమై ప్రభుత్వంలో ఏమి పథకాలు ఇచ్చామో వారికీ అర్థమయ్యేలా వివ రించాల న్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రావు వినోద్, కుచర్లపాటి కృష్ణమరాజు, సోషల్ మీడియా మండల కన్వీనర్ మల్లేలా చంటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: 14 వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని వైసీపీ పట్టణ అధ్యక్షులు పిపిఎస్.చంద్రరావు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లోని వైసీపీ కార్యాల యంలో పట్టణ అధ్యక్షులు పి పి ఎస్ చంద్ర రావు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 సంవత్సరాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల కోట్లకు పైగా డబ్బు ను నేరుగా ప్రజల ఖాతాలలో వేసిన ఘనత దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్‌కి దక్కిందన్నారు. గృహ సారథి, సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లు, కౌన్సిలర్ లు,వైసీపీ నాయకులతో కలిసి ప్రతీ ఇంటికి వెళ్ళి ఈ నాలుగు సంవత్సరాలు ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలను వివరించి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను ఇంటి తలుపులకు అంటించాలని, 82960 82960 నంబర్ కి మిస్డ్ కాల్ చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, అర్బన్ సచివాలయాల కో ఆర్డినేటర్ చలమల శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన వ్యాఖ్యలు అర్ధరహితం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మహిళలను చంద్రబాబు ఓట్లు అడిగే హక్కు లేదు అని మంత్రి ధర్మాన వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. మద్యపాన నిషేధం చేసి మరల ఓట్లు అడుగుతామని చెప్పిన వైసిపికి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా దోచుకు తింటూ ఏదో సంక్షేమం అమలు చేస్తున్నాము అనడం విడ్డూరంగా ఉందన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసింది చంద్రబాబేనని గుర్తు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసిపిని పూర్తి స్థాయి లో సాగనాంపడనికి సిద్ధంగా ఉన్నారన్నారు.

విద్యార్థులకు జోగయ్య అభినందన

విశాలాంధ్ర-పాలకొల్లు: ఈ నెల 28,29,30 తేదీలలో న్యూఢిల్లి లో జరుగబోయే జాతీయ స్థాయి సాంభో బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన వై.యన్ కళాశాల విద్యార్థులను గురువారం మాజీ హోమ్ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు మంచి కోచింగ్ ఇస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిభవంతులుగా తీర్చిదిద్దుతున్న చీఫ్ కోచ్ పాంద్రంగి రుక్మాకర రావు ను, శాలువాతో సత్కరించారు. విద్యార్థులు మరింత ఉన్నతస్థాయికి వెళ్లాలని ఎన్నో పథకాలు గెలుచుకుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం (గొల్లల దిబ్బ) గ్రామానికి చెందిన ముదునూరి శ్రీనివాసరాజు అనే వ్యక్తి గణపవరం, చుట్టుపక్కల గ్రామాలలో చీటీలు కట్టించుకుని పాటదారులకు సొమ్ము ఇవ్వకుండా, కొంతమంది వ్యక్తుల వద్ద డబ్బు అప్పుగా తీసుకుని వారికి కూడా డబ్బు ఇవ్వకుండా మోసం చేసి నందున శ్రీనివాసరాజు పై గణపవరం పోలీస్ స్టేషన్ గురువారం కేసు నమోదు, అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వేముల వెంకటేశ్వరరావు తెలిపారు. సుమారు మూడు కోట్లు మోసం చేసినట్లు ఫిర్యాదులు వచ్చినందున కేసు నమోదు చేశామని, కేసులో నిందితుడు శ్రీనివాసరాజును తాడేపల్లిగూడెం కోర్టుకి పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు

మామిడి రైతులకు అందుబాటులో మ్యాంగో హబ్

విశాలాంధ్ర -నూజివీడు: ఉమ్మడి కృష్ణాజిల్లా నూజివీడు ప్రాంత మామిడి రైతులకు మ్యాంగో హబ్ అందు బాటులో తీసుకొచ్చినట్లు గ్రామోదయ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ చెరుకూరి అన్నారు. నూజివీడు మండలం లీలా నగర్ వద్ద గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన మ్యాంగో హబ్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మామిడి రైతాంగానికి అందుబాటులో గ్రామోదయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాబార్డ్ , ఐటీసీ లిమిటెడ్ గుంటూరు సంయుక్త సహకారంతో మామిడి కేంద్రాన్ని (హబ్బును) ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినివి చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిసి లిమిటెడ్ గుంటూరు విపి ఏబిడి కన్నన్ సేతు రామన్, నాబార్డ్ డీడీఎం అనిల్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం, రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక కొవ్వూరు రోడ్డులో ఉన్న మోక్ష రైస్ మిల్లుకి అక్రమంగా రేషన్ బియ్యం వెళ్తున్నాయన్న సమాచారం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు గురువారం దాడి చేసి పట్టుకున్నారు. విజిలెన్స్ సిఐ విల్సన్ బాబు మీడియాతో మాట్లాడుతూ బుట్టాయగూడెం నుండి ప్రజల నుండి రూ.8లకు రేషన్ బియ్యం కొనుక్కుని ఇక్కడ రైస్ మిల్లుకు తీసుకువచ్చి రూ. 15కు అమ్ముతున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. ఎఫ్. సి. ఐ.కి బియ్యం సప్లై చేసే మోక్ష రైస్ మిల్లులో జరిగిన ఈ ఘటనను ఆధారం చేసుకొని రూ.35 లక్షలు విలువ చేసే 1370 క్వింటాళ్ళ ధాన్యంను ,65 క్వింటాళ్ళ రేషన్ బియ్యం ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఏ ఎస్. ఒ లక్ష్మణ బాబు,డిప్యూటీ తహశీల్దార్ రమేష్ ,వి.ఆర్. ఒ లు ,విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర - కలిదిండి: 10 వ తరగతి పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్ హాజరు అయినట్లు మండల విద్యాశాఖ అధికారి కె. నరేష్ కుమార్ గురువారం తెలిపారు. మండలంలో 5 పరీక్ష కేంద్రాలలో హిందీ పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్ హాజరయ్యారని అన్నారు. ఆరు తగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ముగ్గురు విద్యార్థులు, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు, కలిదిండి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏ సెంటర్‌లో నలుగురు విద్యార్థులు, బి సెంటర్‌లో ఒక విద్యార్థి, బాసరపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి పరీక్షకు హాజరు కాలేదన్నారు. మొత్తం ఎనిమిది వందల ఎనభై తొమ్మిది మంది విద్యార్థులకు 878 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారున్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుంది

విశాలాంధ్ర-టి.నరసాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ సాధిస్తుందని తెలుగు దేశం పార్టీ పోలవరం నియోజకవర్గం ఇన్చార్జి బొరగం శ్రీని వాసులు తెలిపారు. బందంచర్ల గ్రామంలో మండల తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటా తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్మోహనరెడ్డి పాలనపై అసంతృప్తిగా వున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా యని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో జగన్మోహనరెడ్డి ఘోరంగా విఫలమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీ రామమూర్తి, నాయుడు రామకృష్ణారావు గౌడ్,పిన్నమనేని మధు, కొండపల్లి రవి, ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ, భీమవరపు జగన్మోహన రావు, జోనుబోయిన సోంబాబు, ఘంటా సతీష్, పెద్దిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : భారతీయ జనతా పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను మండలంలోని ఎర్రవరం గ్రామంలో పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఏనుగు ధర్మరాజు అధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ స్థాపించి 43 వసంతాలు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏనుగు ధర్మరాజు, బిజేవైయం జిల్లా కార్యదర్శి కూరాకుల రాజా, మండల ప్రధాన కార్యదర్శి బండారు సూరిబాబు పాల్గొన్నారు.

కొత్తపేటలో : కొత్తపేట మండల బిజెపి అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ పాలూరి సత్యానందం, బిజెపి కొత్తపేట అసెంబ్లీ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్ పార్టీ జెండా ఎగురవేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి జనసంఘ్‌గా స్థాపించబడి, జనతాపార్టీగా విస్తరించి, భారతీయ జనతా పార్టీగా 1980లో ఆవిర్భవించిందని నాటి నుండి అనేక ఆటుపోట్లు తట్టుకొని నేడు ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కార్యకర్తలు కలిగిన అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. నిస్వార్థం నిజాయితీ కలిగి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే కార్యకర్తలు కలిగిన పార్టీ బిజెపి అన్నారు. నరేంద్ర మోడీ సారధ్యంలో భారత్ విశ్వగురువుగా తీర్చిదిద్దబడిందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధికారంలోకి వచ్చే విధంగా అందరూ కృషి చేయాలని, బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, బిజెపి ఒబిసి మోర్చ జిల్లా కార్యదర్శి ఇళ్ల పళ్ళంశెట్టి, బిజెపి కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు ఉద్దరాజు ప్రసాదరాజు, బిజెపి ఓబిసి నాయకులు కుడుపూడి దావీదు రాజు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అన్యం సత్యనారాయణ మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గణపవరం తహసీల్దారుగా లక్ష్మి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం తహసీల్దార్‌గా పిఎన్‌వి ఎస్ఎస్ లక్ష్మి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇప్పటివరకు నిడమర్రు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసి పదోన్నతిపై గురువారం గణపవరం తహసీల్దారుగా నియమితులయ్యారు. ఆమెను మర్యాదపూర్వకంగా మండలంలో ఉన్న వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది కలిశారు.

సమన్వయ లోపమే పార్టీకి శాపమా!

విశాలాంధ్ర-చాట్రాయి: చంద్రబాబు నూజివీడు యాత్రకు వస్తున్న నేపథ్యంలో జరిపిన సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది.చాట్రాయి మండల సర్వసభ్య సమావేశాన్ని నూజివీడు ఇన్‌చార్జి కార్యాలయంలో జరపాలని నిర్ణయించడంతో మా మండల సమావేశం నూజివీడులో జరపడం ఏంటి చాట్రాయి మండలంలో సమావేశం కూడా జరుపుకోలేమా అని కొంతమంది మేము నూజివీడు అయితే రాము అని చాట్రాయిలోనే సమావేశం పెట్టాలని పట్టుబట్టడంతో అనివార్యంగా గురువారం సాయంత్రం చీపురుగూడెం బొట్టు రామచంద్రరావు నివాసంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు,నియోజకవర్గ పరిశీలకులు వేణుగోపాల్ఇన్ చార్జి ముద్దరబోయిన హాజరయ్యారు. సభలో లీగల్ సెల్ నాయకులు అచ్చుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెద్ద నాయకులు పనితీరు మారకపోతే కార్యకర్తలమే మిమ్మల్ని మార్చేస్తామని హెచ్చరించారు.ఇన్ చార్జి పనితీరు మాట తీరు కూడా మారాలన్నారు. ముఖ్యంగా మందపాటి బసవా రెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావుల మధ్య సమన్వయం జరిగినప్పుడే పార్టీ ముందుకు వెళ్ళుతుందన్నారు. బొడ్డు వేణుగోపాల్ వచ్చిన తర్వాత వివాదాలు పెరిగాయన్నారు. ఒకమండలంలో ఒక ఊరులో రెండు కార్యాలయాలు ఎందుకని ఒకే కార్యాలయంలో నడపాలన్నారు. జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి మాట్లాడుతూ సమన్వయ లోపమే శాపంగా మారిన మాట నిజమేనన్నారు. స్వచ్ఛందంగా తనపదవికి రాజీనామా చేస్తానని అందరూ అలాగే చేద్దాం అన్నారు. కొత్తవారికి అవకాశం ఇద్దామని గెలిచే వారిని నిలబెట్టుకుందాం అన్నారు. ఇన్ చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చర్చించుకోవడం ద్వారా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు.కలిసి కట్టుగా పనిచేద్దామన్నారు. మండల టిడిపి అధ్యక్షులు మరిడి చిట్టిబాబు అధ్యక్షత నజరిగిన ఈ సభలో తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, రైతుమహిళా జిల్లా కార్యదర్శి మాదాసు చంద్రకళ, టిడిపి మండల ప్రదాన కార్యదర్శి దుర్గారావు ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కళ్ళేపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు పర్వతనేని సంఘీభావం

విశాలాంధ్ర-చాట్రాయి: లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పెను మార్పులు తథ్యమని టిడిపి నూజివీడు నియోజకవర్గ యువ నాయకులు పర్వతనేని గంగాధర్ తెలిపారు.గురువారం అనంతపురం జిల్లా ఉరవకొండలో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ ను కలిసి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పర్వతనేని మాట్లాడుతూ పాదయాత్ర ప్రారంభ మైన నాటినుంచి మార్పులు జరుగుతున్నాయని రానున్న రోజుల్లో అధికార మార్పిడి తధ్యమన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు పూర్తివైద్యం

విశాలాంధ్ర - అంబాజీపేట : రాష్ట్రంలో పేద ప్రజలకు 24 గంటలు వైద్యం ఉచితంగా అందాలనే ఉద్దేశంతో ఏపీలో ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని సీఎం జగన్ ప్రవేశపెట్టారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు చెప్పారు. దేశచరిత్రలోనే వైద్యసేవల విధానంలో నూతన విధానానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని, ఈ కాన్సెప్ట్ దేశ చరిత్రలోనే రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. అంబాజీపేట మండలం తొండవరం గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ఎంపీపీ వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జి. గౌతమి, సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు, ఎంపిటిసి వాకపల్లి దొరబాబు, సొసైటీ చైర్మన్ కొర్లపాటి కోటబాబు, కార్యదర్శి వి. లక్ష్మీపతి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - పెదపూడి : వైయస్సార్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు అన్నారు. గురువారం వాలంటీర్లు, గృహ సారథులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ గ్రామ కార్యకర్తలు, గ్రామ కన్వీనర్లు, ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈశ్వర్ అన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

విశాలాంధ్ర - రాజానగరం : దేశ, రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ నాయకులు మోది సత్తిబాబు, జిల్లా ట్రెజరర్ అడబాల గణపతి రావు అన్నారు.బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన రాజానగరం బస్టాండ్ కూడలి వద్ద గురువారం బీజేపీ శ్రేణులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షులు పేపకాయల కాశీ బీజేపీ జండా ఆవిష్కరించారు. తీపి మిఠాయిలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో మండల యువమోర్చా అధ్యక్షులు చవ్వా చరణ్ గుప్తా,నాయకులు బత్తిన వీరాంజనేయులు, బోయిడి దుర్గారావు,బిక్కిన కామరాజు చౌదరి, తిరుమలనాదని వెంకటేశ్వరరావు, ఆకుల నరేష్, వర్రె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి జీ తెలుగు సూపర్ క్వీన్ 2 ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-రాజమండ్రి: జీవితంలో విజేతలై నిలిచి ప్రేక్షకుల మనసులలో తమకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్న పదిమంది నటీమణులతో ప్రముఖ టెలివిజన్ ఛానల్ జీ తెలుగు 'సూపర్ క్వీన్' అనే రియాలిటీ షోను ప్రారంభించింది. తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల అపూర్వ ఆదరణతో విజయవంతమైన ఈ రియాలిటీ షో రెండో సీజన్ మరోసారి ఈనెల తొమ్మిదో తేదీన ప్రారంభిస్తూ ప్రేక్షకుల ముందుకు రాబోతోందని ఆ ఛానల్ ప్రాంతీయ ప్రతినిధి తెలిపారు. ప్రేక్షకులకు వినోదం పంచుతూనే టైటిల్ కోసం పదిమంది మహిళామణుల మధ్య జరిగే పోరాటమే సూపర్ క్వీన్ 2. అని, ఏప్రిల్ 09న మధ్యాహ్నం 12 గంటలకు ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం కానుందన్నారు. సూపర్ క్వీన్ 2, ఏప్రిల్ 16 నుంచి ప్రతి ఆదివారం ఉదయం 11 గంటలకు, జీ తెలుగులో చానల్లో ప్రసారం కానందని చెప్పారు. ఈ సీజన్లో విద్యుల్లేఖ రామన్, లిఖిత మూర్తి, మౌనిక యాదవ్, ఎస్తర్, ప్రియాంక, సుస్మిత, పవిత్ర, ప్రశాంతి, సుహాసిని వంటి బుల్లితెర నటీమణులతోపాటు తన డ్యాన్స్ అభిమానులను సంపాదించుకున్న కండక్టర్ ఝాన్సీ కిరీటం కోసం పోటీ పడనున్నారని వివరించారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-గొల్లప్రోలు : పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు బిజెపి పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు ఆధ్వర్యంలో గురువారం భారతీయ జనతా పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ..ఏప్రిల్ 6, 1980న పార్టీ స్థాపించిన బిజెపి మహనీయులు శ్యామ్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ, ఎల్‌కె అద్వానీ, వాజపేయి, మహనీయులు స్థాపించడం జరిగిందని తెలిపారు. . అనంతరం భారత ప్రధాని మోడీ ప్రసంగం వినడం జరిగింది. అదేవిధంగా రాబోయే కాలంలో పార్టీ బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.